పరిగి : మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల: చౌడాపూర్ మండలం మందిపల్‌లో పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తున్న పూజారులు, గ్రామస్తులు, భక్తులు

తాండూరు రూరల్: శివపార్వతుల పల్లకీ సేవ

కల్యాణం.. కమనీయం

- వికారాబాద్ జిల్లాలోని శివాలయాల్లో పార్వతీపరమేశ్వరుల పెండ్లి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన ప్రముఖులు, భక్తులు

వికారాబాద్, మార్చి 9 : శివరాత్రిని పురస్కరించుకొని శనివారం మండలంలోని పలు ఆలయాల్లో పార్వతీపరమేశ్వరుల కల్యాణం కనుల పండువలా జరిగింది. పార్వతీపరమేశ్వర గుట్టపై, బుగ్గ రామలింగేశ్వరాలయం తదితర శివాలయాల్లో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయాలకు శివపార్వతుల విగ్రహాలను పల్లకీలో తీసుకొచ్చారు. ఆలయాల సమీపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో శివపార్వతులకు భక్తులు ఘనంగా కల్యాణం చేశారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు వికారాబాద్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూకైలాస్‌లో..

తాండూరు రూరల్ : మండల పరిధిలోని అంతారంతండాలో భూ కైలాస్ ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శంకర్‌నాయక్, వాసునాయక్ ఫవార్ దంపతులు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. అంతకుముందు పల్లకీ సేవ నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహోత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

మహాదేవలింగేశ్వరుడి ఆలయంలో..

బషీరాబాద్ : మండలంలోని జీవన్గి కాగ్నానది ఒడ్డున వెలసిన మహా దేవలింగేశ్వరుడి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం తెల్ల వారుజామున అగ్నిగుండం, పల్లకీ సేవ, సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కల్యాణం, రథోత్సవం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శివరాత్రి జాగరణలో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామస్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్ల వారుజామున ఆలయ సమీపంలోని అగ్నిగుండంలో గ్రామస్తులు, భక్తులు నడిచారు. జాగారం చేసిన భక్తులు, గ్రామస్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు పండ్లు పంపిణీ చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన ముత్య (గురువు) మాట్లాడుతూ భక్తితోనే మనిషికి ముక్తి లభిస్తుందని, మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాణిక్‌రెడ్డి, మునిందర్‌రెడ్డి, వీరారెడ్డి, నర్సిరెడ్డి, హంపిరెడ్డి, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం..

ఆలయ సమీపంలోని కల్యాణ మండపంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామస్తులు పక్క గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు.

శంభులింగేశ్వరాలయంలో..

పెద్దేముల్ : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ శంభులింగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్త నరేశ్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో వేదపండి తులు కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు తీర్థప్రసాదాలు అందించా రు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మార్మోగాయి.

మల్లికార్జున స్వామి ఆలయంలో..

పరిగి : మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్లికార్జున స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కులకచర్ల : మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరా లయ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మహాశివరాత్రిని పురస్కరిం చుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమావాస్యతో ఈ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ముగిసిన ఉత్సవాలు

చౌడాపూర్ మండలంలోని మందిపల్‌లో హోం కారేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని హోం కారేశ్వరాలయంలో శివపార్వ తుల కల్యాణం, పలు పూజా కార్యక్రమాలను అర్చకుడు రాజశేఖర్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వికారాబాద్: శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న భక్తులు



వికారాబాద్: శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

పెద్దేముల్ : శంభులింగేశ్వరాలయంలో..

బషీరాబాద్: మహాదేలింగేశ్వరుడి రథోత్సవానికి హాజరైన ప్రజలు

శివాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, మార్చి 9: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ శివారులోని గాడిబావి శివాలయంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం శివరాత్రి ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్‌బాబు, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, బొంరాస్‌పేట మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నవాజోద్దిన్, ఫయూం, నరేశ్ పాల్గొన్నారు.

రైస్‌మిల్ ప్రారంభం

బొంరాస్‌పేట : మండలంలోని బురాన్‌పూర్ గ్రామానికి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గా భవానీ రైస్‌మిల్‌ను కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. రైస్‌మిల్ యజమాని బీఆర్ఎస్ నాయకుడు దేశ్యానాయక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా దేశ్యానాయక్, జడ్పీటీసీ చౌహాన్ అరుణాదేశు మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమై పార్టీ స్థితిగతులు, వచ్చే లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రావణ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలు తిరుపతయ్య, నర్సింహులు నాయక్, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, అబ్దుల్ వాహబ్, నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం



హనుమాన్ చాలీసా పఠిస్తున్న హిందూవాహిని సభ్యులు

కొడంగల్, మార్చి 9: హిందూవాహిని సభ్యులు గత 24 వారాలుగా పట్టణ శివారులోని సిద్ధినాంపు ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకించి, చందన లేపనతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం హిందూవాహిని సభ్యులతో పాటు భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసాను పఠించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, రచయిత భాస్కర యోగి

కులకచర్ల, మార్చి 9 : హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రముఖ ఆధ్మాత్మికవేత్త, రచయిత భాస్కరయోగి అన్నారు. మండలంలోని బండ వెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీఎన్ఎపీఎస్ ఆధ్వర్యంలో భక్తులకు వివిధ అంశాలపై మార్గదర్శనం చేశారు. దేశంలో హిందూ ధర్మం అంత్యంత పవిత్రమైనదని, హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

దోమలో పోలీస్ కవాతు

దోమ, మార్చి 9 : మండల కేంద్రంలో శనివారం పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఆనంద్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా శ్రీదేవి

వికారాబాద్, మార్చి 9 : బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలిగా వికారాబాద్ మున్సిపాలిటీలోని 24వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి శనివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

మర్పలి : బీజేపీ మర్పలి మండల అధ్యక్షుడిగా రామేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండలాధక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దోమ : మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన పొర్రల అనంతయ్యను బీజేపీ దోమ మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో నియమించిన అధ్యక్ష పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని తెలిపారు.

పూడూరు : బీజేపీ పూడూరు మండల అధ్యక్షుడిగా టి.రాఘవేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా శనివారం రాఘవేందర్‌ను పలువురు బీజేపీ నాయకులు సన్మానించారు. అనంతరం రాఘవేందర్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సినిమా సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బుచ్చన్న, మండల కార్యదర్శి శ్రీశైలం, నాయకులు జంగయ్య, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి గండిపేట చెరువులో శవమై తేలాడు

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మృతుడు నరేశ్(ఫైల్)

మొయినాబాద్, మార్చి 9 : 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయిన వ్యక్తి గండిపేట చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో శనివారం వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చిలుకూరు గ్రామానికి చెందిన నరేశ్(30) చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద కొబ్బరికాయలు, తులసి దండలు విక్రయిస్తూ జీవించేవాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఇంటికి తాగొచ్చి భార్యతో తరచూ గొడవపడేవాడు. వేధింపులు భరించలేక అతడి భార్య గత మూడేండ్లుగా మొయినాబాద్‌లో నివసిస్తున్నది. ఇదిలా ఉండగా నరేశ్ గత పదిహేను రోజులుగా కనిపించకుండాపోయాడు. శనివారం మధ్యాహ్నం చిలుకూరు గ్రామ సమీపంలోని గండిపేట చెరువులో నరేశ్ మృతదేహం కుళ్లిపోయిన దశలో కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా వారు ఘటనస్థలికెళ్లి పరిశీలించారు. వారం, పది రోజుల క్రితమే నీళ్లలో పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నరేశ్ మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గతంలో కేసు నమోదు..

కాగా నరేశ్‌పై మొయినాబాద్ ఠాణాలో 15 రోజుల క్రితమే కేసు నమోదయింది. నరేశ్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు అతడి వదిన ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి గ్రామం నుంచి కనిపించకుండా వెళ్లి చెరువులో శవమై తేలాడంతో అతడి మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

రాయదుర్గంలో యువకుడి దారుణ హత్య

శేరిలింగంపల్లి, మార్చి 9: మణికొండలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఓ యువతి విషయంలో చెలరేగిన వివాదంతో మద్యంమత్తులో ఉన్న యువతి సోదరుడు, అతని స్నేహితులు దాడి చేయడంతో యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగింది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం ప్రకారం.. బోలి చౌకిలో ఉండే విశాల్‌సింగ్ (32) ఏడాది క్రితం మణికొండలో ఉండే ఓ యువతిని ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు విశాల్‌ను మందలించడంతో వివాదం సద్దుమణిగింది. కాగా యువతికి సోదరుడయ్యే శ్యామ్ తన స్నేహితుడు అర్జున్‌సింగ్‌తో రాత్రి విశాల్‌సింగ్‌కు ఫోన్ చేయించి మణికొండకు పిలిపించుకున్నాడు. అనంతరం విశాల్, శ్యామ్, అర్జున్‌సింగ్ మద్యం తాగారు. విశాల్ మద్యంమత్తులో శ్యామ్ సోదరి విషయం బయటకు తీసి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ ఏర్పడింది. అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో శ్యామ్, అర్జున్‌సింగ్‌లతోపాటు వీరి స్నేహితులు భయ్యా, సుమన్, రాజేశ్, సోనీ అరుణ్ తదితరులు విశాల్‌సింగ్ మీద కర్రలతో దాడి చేయగా, విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ విశాల్ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నిందితులు పరారయ్యారు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

రౌడీషీటర్ దారుణ హత్య

బడంగ్‌పేట : రౌడీషీటర్ దారుణ హత్యకు గురైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పాతబస్తీ కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్ మహమద్ ఉస్మాన్ (35) సంవత్సర కాలంగా పహాడీషరీఫ్ పరిధిలోని ఉమర్ కాలనీలో ఉన్న దర్గాకు వస్తున్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దర్గాలో ఓ వ్యక్తిని హత్యచేసి పరారయ్యారని స్థానికులు పోలీసులకు శనివారం సమాచారం అందించారు. వెంటనే మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీషరీఫ్ సీఐ గురువారెడ్డి, ఎస్సై మధుసూదన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు కాలాపత్తర్ రౌడీషీటర్‌గా గుర్తించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు శ్రీచక్ర కామేశ్వరి యాగం

శంకర్‌పల్లి, మార్చి 9: మండలంలోని పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడెంలోని త్రికోణ మహాసుందరి మహాకాళి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2.30 నిమిషాలకు శ్రీ చక్ర కామేశ్వరి యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల నిర్మాణం

బొంరాస్‌పేట ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

బొంరాస్‌పేట, మార్చి 9 : బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు మండలాలకు రూ.7 కోట్ల విలువగల సీసీ రోడ్లు మంజూరయ్యాయి. వాటిని మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో గ్రామాల్లో పనులు జోరందుకున్నాయి. శనివారం మహంతిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దిమడుగు తండాలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ మహిపాల్ ప్రారంభించారు. బొంరాస్‌పేటలోనూ సీసీ రోడ్ల పనులను శనివారం ప్రారంభించారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

అలివేలు(ఫైల్)

కులకచర్ల, మార్చి 9: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన చౌడాపూర్ మండలంలో జరిగింది. నవాబుపేట ఎస్ఐ కథనం ప్రకారం.. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కామారం అలివేలు(33) వివాహం 15 ఏండ్ల క్రితం పగిడ్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో జరిగింది. వివాహం అయిన ఏడాది తర్వాత ఆమె మతిస్థిమితం కోల్పోవడంతో పుట్టింటికి తీసుకొచ్చినట్లు ఆమె సోదరుడు కామారం వెంకటేశ్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలివేలు బయటికెళ్లి తిరిగి ఇంటికొచ్చేదని.. అయితే ఫిబ్రవరి 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నవాటుపేట ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

శిరీశ(ఫైల్)

తాండూరు రూరల్, మార్చి 9 : వివాహిత అదృశ్యమైన ఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు... తాండూరు మండలంలోని ఎల్కకన్నె గ్రామానికి చెందిన శిరీశ (22) ఈ నెల 3న భార్య, భర్తల మధ్య తలెత్తిన గొడవల కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్త శ్రీనివాస్ గ్రామ పరిసర ప్రాంతాలతోపాటు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినీ ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులను ఆశ్రయించారు. అయితే బొడ్డు శ్రీశైలంపై అనుమానం ఉన్నట్లు శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

తాండూరు రూరల్, మార్చి 9 : పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయగా, మరో ఆరుగురు పరారయ్యారని కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సంగంక లాన్ గ్రామ శివారులోని ఓ ఆలయం సమీపంలో 9 మంది పేకాటాడుతున్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెంటనే వెళ్లి పరిశీలించారు. పేకాటాడుతుండగా కల్లురు జగ్గప్ప, శాణప్ప, సగ్గప్పలు దొరికారు. వారిలో నుంచి గంగాధర్, సాబేర్, మోసిన్, రమేశ్, లక్ష్మప్ప, రవి పరారయ్యారని తెలి పారు. దొరికిన వారి నుంచి రూ.7,500 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో పూజలు

చేవెళ్ల రూరల్, మార్చి 9 : మండలంలోని అంతారం గ్రామంలోని అమృతా పంచలింగేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శనివారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవా లను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు సులోచనా అంజన్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణం నిర్వహించారు. భక్తులకు వారు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. హాజరైన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లారీ, కారు ఢీ.. ఒకరు మృతి

పూడూరు, మార్చి 9 : లారీ, కారు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. చన్గోముల్ ఎస్సై మధుసూదన్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన విజయ్‌శేఖర్ (40) శుక్రవారం శివరాత్రిని పురస్కరించుకుని ఆయన తల్లి శివపార్వతిని పరిగి మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి ఆలయం వద్ద వదిలి వెళ్లిపోయాడు. శనివారం విజయ్‌శేఖర్ తల్లిని తీసుకెళ్లడానికి కారులో వస్తుండగా సోమన్‌గుర్తి స్టేజీ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కోర్టు కేసులు

★మీరు మీ కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? ఎంత క్లిష్టమైన కేసులైనా తక్కువ Feesతో నమ్మకమైన లాయర్‌తో Solve చేస్తాం. GLS, L.B.నగర్, Hyd. 7893011777. NT-311861-All

WANTED

★ఇంటర్, డిగ్రీ చదివి భాషీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5. NT-327958-All

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-311806-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, రంగారెడ్డి, కందుకూర్ మండలం, రెవెన్యూ గ్రామం రచ్చూర్ గ్రామం, బేగంపేట్ గ్రామంలోని సర్వే నెం. 214లో ఎ. 1.18 గుంటల విస్తీర్ణపు భూమి నా క్లయింట్ శ్రీ గున్న విజయాందర్ రెడ్డి తండ్రి లేటు జి.పద్మారెడ్డికి చెందినది మరియు అది ఇప్పటికీ అతని వాస్తవిక స్వాధీనంలోనే ఉన్నది. నా క్లయింట్ యొక్క కుటుంబ సభ్యులు అనగా (i) గున్న గౌతమ్ రెడ్డి మరియు (ii) గున్న రవీందర్ రెడ్డి ఇరువురు వారి పేరుమీద రెవెన్యూ రికార్డులో నమోదు చేసుకోవడం జరిగింది. అట్టి వ్యవహారం కోర్టు విచారణలో ఉన్నది మరియు W.P.No. 23876 of 2021 ప్రకారం గౌరవనీయ తెలంగాణ ఉన్నత న్యాయస్థానం సమక్షంలో తీర్పు నిమిత్తం పెండింగులో ఉన్నది.

పై సదరు భూమికి సంబంధించి (i) గున్న గౌతమ్ రెడ్డి మరియు (ii) గున్న రవీందర్ రెడ్డిలతో లావాదేవీలు జరుపదలచిన ఎవరైనా వారి సొంత నష్టపూచీ మేరకు అలా చేసుకోవచ్చు మరియు ఆ తదుపరి సంభవించే వ్యయ పర్యవసానాలకు వారు మాత్రమే బాధ్యులగుదురు.

D